రాము ఏడుస్తున్నాడు. అమ్మ, బామ్మ, నాన్న ఎందరు ఓదార్చినా ఆ పసివాడు ఏడుపు మానటం లేదు. ఎంతో సేపటి నుంచి ఏడుస్తుండటంవల్ల కళ్ళు ఎరుపు ఎక్కాయి. కంఠం బొంగురు పోయింది. తల్లి దగ్గరకు తీసుకుని ఊరడిస్తూ వుంది. తల్లి చల్లని ఒడి కూడా ఆ పసివాడిబాధను మరిపించ లేకపోతూంది. ఏవేవో ఆట వస్తువులు తెచ్చి ఇస్తానని, ఎక్కడెక్కడికో షికార్లు తీసుకు వెళ్తానని బుజ్జగిస్తున్నాడు తండ్రి.



మినీకథ

# తప్పు చేసిన దేవుడు

నిత్య వాడ సోదరిమణులు

నిజానికి రాము ఏడుస్తున్నది ఏ ఆట వస్తువుల కోసమూ మరే షికార్ల కోసమూ కాదు. అయితే తల్లి తండ్రులు అతి సునాయాసంగ రాము కోర్కెలు తీర్చి వుండేవారు. ఏడ్చి ఏడ్చి తన ఒడిలో నిద్రపోయిన బాబుని ఎత్తుకుని మంచం మీద పడుకోబెట్టి నిట్టూర్చింది సుజాత.

తను ఇవ్వలేని సుఖాన్ని తన బిడ్డకు నిద్రాదేవి ఇచ్చింది అనుకుంది. 'ఆదమర్చి నిద్రపోతున్నప్పుడు మాత్రమే వీడికి శాంతి! నిద్రలేస్తే మళ్ళీ ఇంతే.' వాత్సల్యంగా, జాలిగా తన బిడ్డ వైపు చూసి మరోసారి నిట్టూర్చింది ఆ మాతృమూర్తి. ఓ వైపున పుట్టి పుట్టగానే తనకు కడుపు శోకము మిగిల్చి మాయమైన పసికూన మనసును కలచి వేస్తుంటే, పుట్టబోయే చెల్లాయిని గురించి ఎన్నో కలలు కని, ఎన్నెన్నో మమతలు పెంచుకున్న పసివాడు చెల్లాయి కోసము అల్లాడి పోవటం సుజాతను మరింతగా కృంగ దీస్తుంది. వాణ్ని ఎలా సముదాయించాలో, పాపము వాడు మర్చి పోవటానికి తను ఏమి చేయాలో అంతుపట్టడం లేదు.

సుజాతకు ఒక్కసారిగా దుఃఖం ముంచుకొచ్చింది. చేతులలో ముఖము దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. "బాధపడకు సుజీ, మనకు ఆ పాపను పెంచే అదృష్టం లేదు. ఇలా జరిగింది" సుజాత ముఖము తన వైపుకు తిప్పుకుంటూ అన్నాడు శ్రీనివాసు. "పోయిన పాపను గురించి కాదు నా బాధ. చెల్లాయి లేదని బెంగ పెట్టుకుంటున్న రాముని చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతోంది... తనవల్లనే ఇంత జరిగింది. చిట్టి చెల్లాయిని ఇస్తున్నావు అన్నాడు. తను వాడి వెనుకే నిల్చున్నా గమనించకుండా ఆ పటములోని పరమాత్మునితో కబుర్లు చెప్పే వాడు. "చెల్లాయి బుజ్జిగా వున్నప్పుడు ఎంచక్కా ఎత్తుకొని ఆడిస్తా! కొంచెము పెద్ద అయితె చేయి పట్టుకొని నడిపిస్తా! నడక, మాటలు అన్నీ వచ్చేశాక ఇద్దరం కలసి ఎంచక్కా స్కూలుకి వెళ్ళి చదువుకొంటాం ఇలా సాగిపోతే ది ..... .. పరమాత్మునితో ఆ పసిపాపడి వాక్ ధోరణి. వాడి ఆనందాన్ని చూసి అప్పుడు తను ఎంతో సంతోషించింది. ఇప్పుడు ఇలా కుమిలి పోవలసి వస్తూంది. భగవాన్ ఇవి అన్నీ నీ లీలలేనా? అయితే నా బిడ్డ మనస్సుకు నీవే ఊరట కలిగించు' అనుకుంది.

కాల ప్రవాహంలో నెలలు కరిగి పోతున్నా, రాము మాత్రం చెల్లాయిని మరచిపోలేక పోతున్నాడు. రోజూ సాయంత్రము స్కూలు వదలగానే స్కూలుకు దగ్గరగా వున్న రాముల వారి గుడికి వెళ్తాడు.

చేతులు జోడించి స్వామిఎదురుగా నిలబడి, 'దేవుడూ నా చెల్లినిఎందుకుతీసుకున్నావు, మరి ఎందుకు ఇచ్చావు? తీసుకోవటానికా? నేను ఎంత సరదాపడ్డానో నీకు తెలుసుగా, చెల్లాయితో జట్టుగా వుండాలని ఎంత అనుకున్నానో! ఒక్క రోజు వుంచి తీసుకుంటావా? నీకు నా మీద కోపము వచ్చిందా? దేవుడూ నేను ఏమి తప్పు చేశాను. ఏమీ చెయలేదే! నా చెల్లాయిని తీసుకోవటం నీదే తప్పు. అసలు నువు మంచివాడివి కాదు. ఆశ పెట్టి మోసము చేశావు. ఇచ్చినట్టే ఇచ్చి, చెల్లాయిని లాక్కున్నావు. నువ్వేఎత్తుకుపోయావని అమ్మ, బామ్మ అందరూ అంటున్నారు.

నువ్వెంతో మంచివాడివి అనుకున్నాను. మరెందుకు ఇలా చేశావు...." ఆ విగ్రహం తో తన ఆవేదనంతా వెళ్ళపోసుకుంటాడు ఆరేళ్ళ నిండని ఆ పసిపాపడు. నిజంగా ఆ విగ్రహములోనే పరమాత్ముడు వుంటే ఎంత పశ్చాత్తాప పడేవాడో!

ఇదే జరిగిందేమో— ఏడాది తిరక్కుండానే రాముకి మళ్ళీ చెల్లాయి పుట్టింది. ఈ సారి రామూ ఊహలు అన్నీ నిజం అయ్యాయి. బుజ్జి చెల్లాయిని ఎత్తుకుని ఆడించాడు. చేయి పట్టుకొని నడక నేర్పాడు. ముద్దు ముద్దుగా అన్నా అని పిలుస్తూ వుంటే మురిసిపోయాడు.

ఇప్పుడిప్పుడే రాముతో స్కూలుకు కూడా వెళ్తోంది పాప. రోజూ తనే చెల్లాయి చేత అక్షరాలు దిద్దిస్తాడు. ఇప్పుడు రాము మనసు నిండా ఎంతో సంతోషం . చెల్లాయితో ఎన్నెన్నో మురిపాలో! దాన్ని విడిచి ఒక్క క్షణం కూడా వుండలేదు.

చల్లని సాయంత్రం వేళ వీధి వాకిట్లో కూర్చుని చదువుకుంటున్నాడు. తన ప్రక్కనే చెల్లాయిని కూర్చోపెట్టుకొని అక్షరాలు దిద్దిస్తున్నాడు. "అన్నయ్యా! ఎంత దిద్దినా ఈ రెండు అక్షరాలు రావటంలేదు. తప్పులొచ్చేస్తున్నాయి" తనకు సరిగ్గా రాని రెండు అక్షరాలు రాముకి చూపించి పాప చిక్క ముఖం పెట్టింది. "చెల్లాయి భయపడకు! అలా దిద్దుతుంటే అవే వస్తాయి. తప్పు దిద్దుకుంటే అదే ఒప్పు అవుతుంది.

దేవుడు కూడా ఒక్కోసారి తప్పులు చేసి దిద్దుకొంటాడు తెలుసా" అన్నాడు. ఆ పసిపాపడి మాటకు పరమాత్ముడు ఎక్కడ ఏ రూపంలో వున్నా అతని పెదవులపై దరహాస రేఖలు విరియక మానవు. ●